సాక్షి
వైఎస్సార్ జిల్లా
బుధవారం । 4 । జూన్ । 2025



ఉజ్వల భవితకు 'నవోదయ'ం
నవోదయ విద్యాలయంలో సీటు సాధిస్తే.. ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడినట్లే. 2026-2027 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. - 8లో



ఈ 'పాప'ం ఎవరిది!
మూడు రోజుల క్రితం జన్మించిన మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు తీసుకొచ్చి గద్దె వామి వద్ద వదిలేసి వెళ్లారు. ఈ సంఘటన వీరబల్లి మండలంలో జరిగింది - 8లో

గరిష్టం/కనిష్టం
36.9 /28.0

వాతావరణం
జిల్లాలో మంగళవారం 28.0 - 36.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

నయవంచనపై నిరసన

- ప్రజలకు చంద్రబాబు మరోసారి మోసం
- ఊరిస్తున్న తల్లికి వందనం పథకం
- అందని ద్రాక్షలా నిరుద్యోగ భృతి
- 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.15 వందలు ఉత్తిదే
- రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేల ఊసేలేదు
- స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణం మాటే మర్చారు
- 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ' పేరుతో ఊదరగొట్టిన టీడీపీ నేతలు
- ఏడాదైనా అమలు కాని 'సూపర్ సిక్స్' పథకాలు
- నేడు వెన్నుపోటు దినంపై ఆందోళనలు



సాక్షి ప్రతినిధి, కడప : మారిన మనిషిగా అనుచరగణం కీర్తించారు, పథకాల పేర్లతో జనాన్ని నమ్మించారు. అధికారం కోసం అబద్ధాల హామీల ముసుగు వేసుకున్నారు. ఎన్నికల్లో నెగ్గారు, ఆపై నిజస్వరూపం బహిర్గతమైంది. ఏడాది కాలంలో హామీలు తుంగలో తొక్కేశారు. ప్రకృతి సంపద ఆధారంగా తెలుగు తమ్ముళ్లు దోపిడీ యథేచ్ఛగా తెరపైకి వచ్చింది. పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు తిలోదాకాలు ఇచ్చారు. 'నాడు-నేడు' వెలుగు కరిగిపోయి, విద్యా వ్యవస్థకు చంద్రగ్రహణం ఆవహించింది. తల్లికి వందనం ఊరిస్తోంది. ఆడబిడ్డ నిధి మాటే లేదు. నిరుద్యోగ భృతి అందని ద్రాక్ష పుల్లన అన్నట్లు ఉండిపోయింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసేలేదు. 'బాబు ష్యూరిటీ... భవిష్యత్‌కు గ్యారెంటీ'తో జనం మధ్యకు వచ్చారు. సీఎం చంద్రబాబు మాటల గారడీని నమ్మి మోసపోయామని ఆవేదన చెందడం ప్రజల వంతైంది. ఏడాది పాలనలో అవినీతి, మోసం, నయవంచన, కుట్ర, పగ, వెన్నుపోటు రాజ్యమేలుతున్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

ఊరువాడ ప్రచారం

'ప్రతి ఇంటికీ ఉద్యోగం.. లేదంటే నిరుద్యోగ భృతి రూ.3 వేలు తప్పకుండా ఇస్తాం' ముఖ్యమంత్రి యువనేస్తం పథకం ద్వారా ప్రతి నిరుద్యోగికి భృతి చెల్లిస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఊదరగొట్టారు. 'అమ్మ ఒడి' పథకంలో సమూల మార్పులు తీసుకువస్తాం. ఎంత మంది విద్యార్థులంటే అందరికీ 'తల్లికి వందనం' పథకం ద్వారా రూ.15 వేలు చొప్పున చెల్లిస్తాం. ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే రూ.30 వేలు, ముగ్గురుంటే రూ.45 వేలు చెల్లిస్తాం' అని ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. 'రైతులను ఆదుకుంటాం. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడికి 'అన్నదాత సుఖీభవ పథకం' ద్వారా రైతులకు రూ.20 వేలు ఇవ్వనున్నట్లు' హామీ ఇచ్చారు. 18 సంవత్సరాలు నిండిన యువతి నుంచి 59 సంవత్సరాల వరకూ ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున 'ఆడబిడ్డ నిధి' చెల్లిస్తామని ఊరువాడా చెప్పుకొచ్చారు. మహిళలు ఎక్కడికెళ్లినా సరే ఉచితంగా ప్రయాణ సదుపాయం కల్పిస్తాం. ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం అంటూ ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి ఏడాదైంది. ఇప్పటికీ చెప్పిన మాట చెప్పినట్లుగా, ఇచ్చిన హామీలు ఇచ్చినట్లుగా అమలు చేయలేదు. ప్రజలను వంచించి 'వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్'గా సీఎం చంద్రబాబు కీర్తి గడిస్తున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

ఆశపడి ఆపై మోసపోయి..

సామాన్యులకు కామధేనువుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలిచింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో నిమిత్తం లేదు. చెప్పిన మాట చెప్పినట్లుగా అమలు చేయడమే లక్ష్యంగా ఐదేళ్ల నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కార్ కొనసాగించింది. కేలండర్ విడుదల చేసి ఏ పథకం ఎప్పుడు అమలు చేస్తామనే విషయాన్ని తేదీలతో సహా బహిర్గతం చేసి సరిగ్గా ఆ తేదీకి అమలు చేసిన చరిత్ర ఆయన సొంతమైంది. జిల్లాలో డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారులు 9,82,554 మంది బ్యాంకు ఖాతాలకు రూ.8,857.42 కోట్లు వేశారు. నాన్ డీబీటీ ద్వారా మరో 9,72,388 మందికి రూ.3,279.10 కోట్లు చెల్లించారు. మొత్తంగా రూ.12,136.52 కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారికి అందించి చరిత్ర సృష్టించారు. సామాన్యుల జేబులు డబ్బులతో గలగలు ఉండేవి. అంతకంటే ఎక్కువగా అందిస్తామని సూపర్ సిక్స్ పేరుతో పథకాలు ప్రవేశ పెట్టడంతో ఆశపడి టీడీపీ మాటలకు మోసపోయారు. ఏడాదైనా ఒక్క రూపాయి ప్రజలకు నేరుగా అందిన దాఖలాలు లేవు. కామధేనువులాంటి వైఎస్ జగన్ సర్కార్‌ను పోగొట్టుకొని, దున్నపోతు లాంటి చంద్రబాబు సర్కార్ తెచ్చుకున్నామని ప్రజలు ఆవేదన పడుతున్నట్లు పరిశీలకులు చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీ పోరుబాట



సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై వైఎస్సార్‌సీపీ మొదటి నుంచి గర్జిస్తోంది. జూన్ 4న, బుధవారం 'వెన్నుపోటు దినం' పాటిస్తోంది. నియోజకవర్గ కేంద్రాల్లో నిరశన పాటించేందుకు సన్నాహాలు పూర్తి అయ్యాయి. ఇప్పటికే మరోమారు చంద్రబాబు హామీలతో మోసపోయామని ప్రజలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలపై భారీ స్థాయిలో ప్రజలు పాల్గొనే అవకాశం ఉందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అన్నీ ప్రాంతాలల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టేందుకు ఆ పార్టీ సర్వసన్నద్ధమైంది.

చంద్రబాబు సర్కారులో జిల్లాలోని అర్హులకు అందాల్సిన సొమ్ము వివరాలు

పథకం పేరు	జిల్లాలో అర్హులైన లబ్ధిదారులు	ఏడాది పాలలో అందాల్సిన మొత్తం (రూ.కోట్లలో)
ఆడబిడ్డ నిధి	7,06,974 (18ఏళ్లు నిండిన మహిళలు)	1,272.6
యువనేస్తం పథకం	2.80 లక్షలు	1,008
తల్లికి వందనం	3.58 లక్షల విద్యార్థులు	538.24
అన్నదాత సుఖీభవ	2,10,481	420.96
ఉచిత ప్రయాణం	38,700 (ప్రతి రోజు ప్రయాణిస్తున్న మహిళలు)	1,393

విజయవంతం చేయండి



రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిగా ప్రజల్ని వంచించింది. సీఎం చంద్రబాబు తన సహజ ధోరణి వీడలేదు. ప్రజల్ని నిలువునా మోసగించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. పైగా రాజ్యాంగాన్ని విస్మరించి ఏకపక్ష పాలన సాగిస్తున్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లీవిగా జీవించిన ప్రజలు అనేక కష్టనష్టాలు చవిచూస్తున్నారు. ఏడాదికే తీవ్రస్థాయి అసహనం వ్యక్తం చేస్తున్నారు. 'వెన్నుపోటు దినం' నిరసన విజయవంతం చేయండి. ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి బలంగా విన్పించాలి.
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

మోసం.. చంద్రబాబు నైజం



ప్రజల్ని మోసగించడం, అబద్ధాలతో వంచించడం సీఎం చంద్రబాబు నైజం. సూపర్ సిక్స్ పథకాల పేర్లతో పక్కాగా మోసగించాడు. 1995 నుంచి 2025 వరకూ చంద్రబాబు చరిత్ర పరిశీలిస్తే విశ్వసనీయత అనేది లేదు. ఏ అవసరానికి అనుగుణంగా ఆ గొడుగు మార్చే రకం. ఎన్టీయార్‌ను మొదలుకొని తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, బామ్మర్ది హరికృష్ణ, తుదకు జూనియర్ ఎన్టీయార్‌లను వాడుకొని వదిలేశారు. ప్రజల్ని కూడా తన అవసరానికి అనుగుణంగా అబద్ధాలు చెప్పి మోసగించారు. ఏడాదిగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందలేదు. ఈ తరుణంలో వైఎస్సార్‌సీపీ చేపడుతున్న 'వెన్నుపోటు దినం' జయప్రదం చేయాలి.
- పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

చంద్రబాబు ఏడాది పాలనలో కోల్పోయింది ఎంతంటే..

జిల్లా వ్యాప్తంగా దారిద్ర్యరేఖకు దిగువన(బీపీఎల్) 5,82,633 కుటుంబాలు ఉన్నాయి. ఆ కుటుంబాలకు చెందిన చదువుకున్న యువకులంతా నిరుద్యోగ భృతికి అర్హులే. సరాసరిగా 83 వేల బీపీఎల్ కుటుంబాలు ప్రతి నియోజకవర్గంలో ఉన్నాయి. సగం మందికి అటు ఇటుగా విద్యావంతులున్నా.. ప్రతి నియోజకవర్గంలో దాదాపు 40 వేల మందికి నిరుద్యోగ భృతి దక్కాల్సిన పరిస్థితి ఉండిపోయింది. ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి పోతే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున అందిస్తామని చెప్పడంతో తల్లిదండ్రులు ఆనందపడ్డారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,32,224 మంది 10వ తరగతి వరకు విద్యార్థులు ఉన్నారు. మరో 26,601 మంది ఇంటర్మీడియెట్ విద్యార్థులున్నారు. ఎన్నికల మ్యేనిఫెస్టో ప్రకారం వీరందరికీ రూ.15 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అంటే రూ.538.24 కోట్లు చెల్లించాల్సి ఉంది. రైతుల పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ. 20 వేలు ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 2,10,481 మంది రైతులు సుఖీభవ పథకానికి అర్హులు. ఈ పథకం ద్వారా రూ.420.96 కోట్లు రైతులకు అందించాల్సి ఉంది. 18 ఏళ్లు నిండిన యువతి నుంచి 59 ఏళ్ల వరకు ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఆడబిడ్డ నిధి చెల్లిస్తామని చెప్పుకొచ్చారు. ప్రతి మహిళకు రూ.18 వేలు ఏడాదికి చెల్లించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 7,06,974 మంది మహిళలు అర్హులు. ఏడాదికి రూ.1,272.6 కోట్లు దక్కాల్సి ఉంది. జిల్లాలో సరాసరిగా ప్రతి రోజు 1.29 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. అందులో 30 శాతం మంది మహిళలు ప్రతి రోజు ప్రయాణం చేస్తున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే 38,700 మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. తక్కువలో తక్కువంటే సరాసరిగా రూ.100 చార్జీలు చెల్లిస్తున్నారనుకున్నా, ప్రతి రోజు రూ.38.7 లక్షలు మహిళలు చార్జీల రూపేణా భరిస్తున్నారు. అంటే నెలకు రూ.116.1 కోట్లు మహిళలు చెల్లిస్తున్నారు. ఏడాదికి రూ.1,393 కోట్ల భారం భరించారని నిపుణులు వివరిస్తున్నారు.

న్యూస్‌రీల్

పొలంలో బయల్పడిన వినాయక విగ్రహం



వినాయక విగ్రహం వద్ద గ్రామస్తులు

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తగిరియంపల్లె గ్రామానికి చెందిన రైతు నడిపి సుబ్బారెడ్డి పొలంలో మంగళవారం వినాయక విగ్రహం బయల్పడింది. వెల్లటూరు గ్రామ రెవెన్యూ భూమిలోని భేతాళ ఆంజనేయస్వామి గుడి దగ్గరలోని పొలంలో.. ఆయన ట్రాక్టర్‌తో సేద్యం చేస్తుండగా గొర్రుకు పెద్ద రాయి తగిలింది. దానిని వెలికితీయగా వినాయక విగ్రహం కనిపించింది. దీంతో సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకొని వినాయక విగ్రహానికి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. పూర్వం ఈ ప్రదేశంలో గుడి ఉండి ఉంటుందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి



మాట్లాడుతున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్ : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. కడప జయనగర్ కాలనీలో బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్‌లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజైన మంగళవారం డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలు విద్యార్థులకు చేరవేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌సీఆర్‌టీ అబ్జర్వర్ బ్రహ్మానందరెడ్డి, డైట్ లెక్చరర్లు గిరిబాబు, రెడ్డెయ్య, స్టేట్ రీసోర్సు పర్సన్స్ సుబ్బానాయుడు, గంగాధర్, తిరుమలకొండ, సురేష్‌కుమార్‌రెడ్డి, కృష్ణానాయక్, బాబా సాహేబ్ తదితరులు పాల్గొన్నారు.

7న యోగాంధ్ర

రాయచోటి : ఈనెల 7న తాళ్లపాక అన్నమయ్య సన్నిధిలో అత్యంత వేడుకగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 617 మందితో యోగాసనాలు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'జేఈఈ'లో మెరిసిన కడప కుర్రాడు

ఆల్ ఇండియా స్థాయిలో 211వ ర్యాంకు



జశ్వంత్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

కడప ఎడ్యుకేషన్ : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కడపలోని భాగ్యనగర్‌కు చెందిన మొలకల జశ్వంత్‌రెడ్డి మెరిశాడు. ఆల్ ఇండియా స్థాయిలో 211వ ర్యాంకు సాధించి భళా అనిపించాడు. మొలకల రాజకిషోర్‌రెడ్డి, శ్రీలత కుమారుడు జశ్వంత్‌రెడ్డి ఒకటి నుంచి 5వ తరగతి వరకు కడప నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో చదివాడు. 6 నుంచి 10వ తరగతి వరకు నారాయణ ఒలింపియాడ్‌లో చదివాడు. ఆ తరువాత ఇంటర్మీడియెట్‌ను విజయవాడ కానూర్‌లోని నారాయణలో పూర్తి చేశాడు. ప్రస్తుతం విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 211వ ర్యాంకును సాధించాడు. గతంలో విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో 777వ ర్యాంకు సాధించాడు. దీంతోపాటు విట్‌లో 36వ ర్యాంకు, తెలంగాణా ఎంసెట్‌లో 38వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. డాక్టర్ రాజకిషోర్‌రెడ్డి సొంత గ్రామం వీరపునాయునిపల్లె మండలం అనిమెల అయితే కడపలో స్థిరపడ్డారు. ఆయన ప్రస్తుతం విజయవాడ డైరెక్టర్ ఆఫ్ యానిమల్ హస్బెండరీలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా చేస్తున్నారు.

బ్యాంకర్లతోనే ఆర్థిక వ్యవస్థ పటిష్టం

కడప అగ్రికల్చర్ : బ్యాంకర్లు సమర్థంగా పని చేస్తేనే ఆర్థిక వ్యవస్థ దృఢంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్‌ఆర్‌సీ) బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలు రకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్రప్రదేశ్ -2047 దిశగా వైఎస్ఆర్ జిల్లాను కూడా ముందుకు నడిపించాలన్నారు. అందుకుగాను వైఎస్ఆర్ విజన్ యాక్షన్ ప్లాన్ 2024-29 ప్రకారం జిల్లాను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. పొదుపు సంఘాల మహిళలు, రైతులు, విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులకు రుణాలు అందించి, ఆర్థిక చేయూత ఇవ్వాలన్నారు. అనంతరం 2025-26 జిల్లా క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని బ్యాంక్ అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్ధనం, నాబార్డ్ ఏజీఎం విజయ విహారి, రిజర్వ్ బ్యాంక్ ఎల్డిఓ రాజేష్ కుమార్, కెనరా బ్యాంకు ఏజీఎం అరుణ జ్యోతి, ఎస్‌బీఐ ఏజీఎం కృష్ణ కిషోర్, యూబీఐ ఏజీఎం లక్ష్మి తులసి, ఏపీజీబీ ఏజీఎం శ్రీనివాస ప్రసాద్, కేడీసీసీ సీఈఓ రాజమ్మ, డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య, వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారిణి సుభాషిణి, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, డీఐఏ జిల్లా కోఆర్డినేటర్ ఎస్వీ రమణ, వివిధ బ్యాంకుల జిల్లా మేనేజర్లు, ఆర్‌ఎంలు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.శ్రీధర్

డీఎస్సీ పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షలకు ఎటువంటి అసౌర్యాలు కలగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో విద్యుత్, పోలీసు, వైద్య ఆరోగ్య, రవాణా శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ, పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

మద్దతు ధర.. అరకొర

- కేంద్ర ప్రభుత్వం 14 పంటలకు మద్దతు ధర పెంపు
- స్వల్పంగా పెంచడంపై అన్నదాతల్లో అసంతృప్తి
- కంటితుడుపు చర్య అంటున్న రైతు సంఘాలు
- సాగు ఖర్చులకు అనుగుణంగా ప్రకటించాలని వినతి



వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు ఆశాజనకంగా లేవు. పెరుగుతున్న ఎరువులు, పురుగు మందులు, ఇతరత్రా వ్యవసాయ ఖర్చులకు అనుగుణంగా నిర్ణయించడం లేదు. వివిధ పంటల సాగు, ఉత్పత్తి వ్యయాలకు.. మద్దతు ధరకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. ఏటా కంటితుడుపుగా నామమాత్రంగా పెంచుతున్నారే తప్ప.. క్షేత్ర స్థాయి పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవటం లేదని రైతులు వాపోతున్నారు.



కడప అగ్రికల్చర్ : కేంద్ర ప్రభుత్వం 2025-26 ఖరీఫ్ సీజన్‌లోని 14 పంటలకు ఇటీవల మద్దతు ధర ప్రకటించింది. ఇందులో ప్రధాన పంటలైన వరి, పత్తి, వేరుశనగ, నూనెగింజ పంటలైన పొద్దుతిరుగుడు, నువ్వులు, సోయాబీన్‌తోపాటు మిల్లెట్స్ రకాలైన జొన్న, సజ్జ, రాగి, మొక్కజొన్న, పెసలు, కంది, మినుములకు కనీస మద్దతు ధర పెంచింది. ప్రస్తుత పరిస్థితుల్లో విత్తనాలతోపాటు ఎరువులు, కూలీలు ఇలా ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచి ఉంటే బాగుండేదని పలువురు రైతులు అంటున్నారు. వైఎస్సార్ జిల్లాలో అధిక విస్తీర్ణంలో సాగు చేసే వరి పంటకు గతేడాది కంటే ఈ ఏడాది కేవలం రూ.69 మాత్రమే ధర పెంచడంపై అన్నదాతలు అంతగా సంతృప్తి చెందడం లేదు. జిల్లాలో అధిక విస్తీర్ణంలో సాగు చేసే కొంత మంది వరి రైతులు ఈ మద్దతు ధరపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏ పంటకు ఎంత మద్దతు ధర

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు సంబంధించి వరి సాధారణ రకం క్వింటాలుకు రూ.2300 ఉండగా 2369కి పెంచారు. అలాగే గ్రేడ్-ఏ రకానికి 2320 ఉండగా 2389, జొన్న (హైబ్రీడ్) రూ.3371 ఉండగా 3699, జొన్న (మాల్దండి) రూ. 3421 ఉండగా 3749, సజ్జలు రూ.2625 ఉండగా 2775, రాగులు రూ.4290 ఉండగా 4866, మొక్కజొన్న రూ.2225 ఉండగా 2400, వేరుశనగ రూ.6783 ఉండగా 7263, పొద్దుతిరుగుడు విత్తనాలు రూ.7280 ఉండగా 7721, నువ్వులు రూ.9267 ఉండగా 9846, సోయాబీన్ రూ.4892 ఉండగా 5328, పెసలు రూ.8682 ఉండగా 8768, పత్తి (మధ్యరకం) రూ.7121 ఉండగా 7710, పత్తి (లాంగ్ స్టెపెల్) రూ.7521 ఉండగా 8110కి పెంచారు.

పెరుగుతున్న సాగు ఖర్చులు

కేంద్ర ప్రభుత్వం ఏటా మద్దతు ధర ప్రకటిస్తూనే ఉంది. అయితే అనుకున్న మేర మాత్రం పెంచడం లేదని పలువురు రైతులు అంటున్నారు. కంటితుడుపుగా మాత్రమే మద్దతు ధరలను ప్రకటిస్తోందని, వీటితో రైతులకు గిట్టుబాటు కావడం లేదని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. 2018-19 నుంచి ఇప్పటి వరకు ఏటా సగటున వరి ధాన్యంపై సరాసరిన రూ.100కు లోపే పెంచింది. మరోవైపు సాగు ఖర్చులు మాత్రం ఏటా పెరుగుతూ వస్తున్నాయి. గతంలో రూ.13 వందల ఉండే కాంప్లెక్స్ ఎరువుల బస్తా ఇప్పుడు రూ.18 వందలకు చేరింది. డీజిల్ ధర పెరగడంతో ట్రాక్టరు యజమానులు సేద్యం ధరలను పెంచేశారు. కూలీలు, ఎరువులు, పురుగు నివారణ మందులు ఇలా అన్ని రకాల ధరలు భారీగా పెరిగాయి. మొత్తం మీద సాగు ఖర్చులు గతం కంటే 8 వేల నుంచి 10 వేల వరకు పెరిగాయి. కావున సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని అందుకు తగ్గట్టుగా మద్దతు ధరను పెంచాలని పలువురు రైతులు, రైతు సంఘ నాయకులు కోరుతున్నారు.

2018 నుంచి వరికి కనీస మద్దతు ధర వివరాలు ఇలా (క్వింటాలుకు)...

సంవత్సరం	సాధారణ రకం	ఏ గ్రేడు రకం
2018-19	1750	1777
2019-20	1815	1835
2020-21	1865	1888
2021-22	1940	1960
2022-23	2020	2060
2023-24	2183	2203
2024-25	2300	2320
2025-26	2369	2389

గతేడాది, ఈ ఏడాది పెరిగిన మద్దతు ధరల వివరాలు

పంట	2024-25	2025-26	పెరిగిన ధర
వరి సాధారణ	2300	2369	69
వరి ఏ గ్రేడ్	2320	2389	69
జొన్న హైబ్రీడ్	3371	3699	328
జొన్న (మల్దాని)	3421	3749	328
సజ్జలు	2625	2775	150
రాగులు	4290	4866	576
మొక్కజొన్న	2225	2400	175
కందులు	7550	8000	450
పెసలు	8682	8768	86
వేరుశనగ	6783	7263	480
పొద్దుతిరుగుడు	7280	7721	441
సోయాబీన్	4892	5328	436
నువ్వులు	9267	9846	579
పత్తి	7121	7710	589
పత్తి (లాంగ్ స్టేపుల్)	7521	8110	589

ఆచరణలో చూపెట్టాలి



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు కింది స్థాయిలో రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలు దళారులకు అందుతున్నాయి తప్ప సామాన్య రైతులకు అందడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల వల్ల రైతులకు కొంత వరకైనా ఉపశమనం కలగాలంటే కచ్చితంగా అమలు జరగాలి.
- మోహన్‌రెడ్డి, రైతు, సుంకేసుల

ఖర్చులకు అనుగుణంగా...



ఖర్చులను పరిగణనలోకి తీసుకోకుండా మద్దతు ధరలు ప్రకటించడం వల్ల అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇంత తక్కువ మద్దతు ధర పెంచడం ఏమాత్రం లాభం లేదు. అన్ని రకాల ఉత్పత్తుల ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని పునఃపరిశీలన చేసి ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలను ప్రకటించాలి.
- సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యాన మాజీ సలహాదారు

గిట్టుబాటు అయ్యే విధంగా లేవు



కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతు ధరలు రైతులకు ఏమాత్రం గిట్టుబాటు అయ్యే విధంగా లేవు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని పదేళ్ల క్రితమే చెప్పిన కేంద్రం మద్దతు ధరలను అరకొరగానే పెంచుతోంది. మద్దతు ధరలు ఆశాజనకంగా లేకపోవడం, సాగు ఖర్చులు పెరగడం వల్ల రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.
- పోతిరెడ్డి భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

క్లుప్తంగా

రేషన్ షాపు సీజ్



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరంలోని అల్మాస్‌పేటలో ఉన్న 29వ రేషన్ షాపును సీజ్ చేసినట్లు ఆర్డీఓ జాన్ ఇర్విన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం ఆర్డీఓ జాన్ ఇర్విన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దక్షిణామూర్తి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మనోజ్‌లు రేషన్ షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దక్షిణామూర్తి మాట్లాడుతూ రేషన్ షాపులో 6,220 కిలోల బియ్యం ఉండాల్సి ఉండగా, కేవలం 1720 కిలోల బియ్యంతో పాటు చక్కెర ప్యాకెట్లు 417 ప్యాకెట్లు ఉండాల్సి ఉండగా, 430 ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీనిపై సరైన సమాధానం చెప్పకపోవడంతో కేసు నమోదు చేసి రేషన్ షాపు సీజ్ చేశామన్నారు. రేషన్ షాపులో ఉన్న బియ్యంతోపాటు చక్కెరను వీఆర్‌ఓకు అప్పగించామన్నారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు వీఆర్‌ఓ ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేస్తామని తెలిపారు.

కూలిన ఇంటి పైకప్పు



మట్టి మిద్దె పైకప్పు కూలిన దృశ్యం

కొండాపురం : మండల పరిధిలోని కె.రామిరెడ్డిపల్లె గ్రామంలో చప్పిడి వెంకటరెడ్డి అనే రైతుకు చెందిన ఇంటి పై కప్పు ఉన్నట్లుండి కూలిపోయింది. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి రైతు వివరాల మేరకు ఇటీవల కురిసిన వర్షానికి ఇంటిపై కప్పులో ఉన్న చొడు బాగా నానడంతో బరువుకు మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒక్కసారిగా కూలింది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న లేగ దూడలపై మట్టి పడటంతో వెంటనే స్థానికుల సాయంతో బయటకు తీయడంతో వాటికి కూడా ప్రమాదం తప్పింది.

రిమ్స్ మార్చురీలో వృద్ధుడి మృతదేహం



కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో క్యాజువాలిటీకి తీవ్ర అనారోగ్య స్థితిలో మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి (50)ని తీసుకుని వచ్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను నేరుగా సంప్రదించాలని అధికారులు కోరారు.

కడప రిమ్స్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పెంచలయ్య



కడప రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్యను సత్కరిస్తున్న ఎన్జీఓ సంఘం నాయకులు

కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో డీపీఎల్ విభాగం హెచ్‌ఓడీగా పనిచేస్తున్న డాక్టర్ పెంచలయ్య నూతన సూపరింటెండెంట్‌గా (ఎఫ్‌ఏసీ)గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనను గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు కంభం చిన్నయ్య, జిల్లా కార్యదర్శి రవికుమార్, సంయుక్త కార్యదర్శి వెంగళరావు, కార్యవర్గసభ్యులు డాక్టర్ రాఘవేంద్రకుమార్ రెడ్డి, ప్రభాకర్, సుహాసిని, కుమారి, విజయ్‌కుమార్, మధుసూదన్, రాము తదితర ఎన్జీఓ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జవహర్ నవోదయలో విద్యాభ్యాసం..

ఉజ్వల భవిష్యత్తుకు సోపానం

- సీటు సాధిస్తే.. బంగారం లాంటి జీవితం
- ఆరవ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- ప్రణాళికాబద్ధంగా ఇష్టంతో చదివితే సీటు సొంతం
- జిల్లాలో రెండు జవహర్ నవోదయ విద్యాలయాలు



రాజంపేట మండలం నారమరాజుపల్లెలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయం

రాజంపేట టౌన్ : జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధిస్తే చాలు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడినట్లే. అన్నమయ్య జిల్లాలో రెండు జవహర్ నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. అందులో ఒకటి రాజంపేట మండలం ఆకేపాడు పంచాయతీలోని నారమరాజుపల్లెలో, మరొకటి మదనపల్లె మండలం వలసపల్లెలో ఉంది. ఒక్కో విద్యాలయంలో ఆరవ తరగతిలో 80 సీట్లను భర్తీ చేసేందుకు ప్రతి ఏటా ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లాలకు చెందిన దాదాపు 10 వేల మందికి పైగా విద్యార్థులు ప్రతి ఏటా ప్రవేశ పరీక్షను రాస్తున్నారు. జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధిస్తే క్రమశిక్షణతో కూడిన మెరుగైన విద్య లభించి తద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రవేశ పరీక్షను రాయిస్తారు. అందువల్ల పోటీ తీవ్రంగా ఉంటుంది. పోటీకి తగ్గట్లు ప్రశ్నాపత్రం సరళి కూడా కొంత కఠినతరంగానే ఉంటుంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో చదివిన విద్యార్థులకు రాజంపేటలోని నవోదయ విద్యాలయంలో, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదివిన విద్యార్థులకు మదనపల్లెలోని నవోదయ విద్యాలయంలో సీట్ల కేటాయింపు ఉంటుంది. కాగా ఓ ప్రణాళికాబద్ధంగా ఇష్టంతో కష్టపడి చదివితే సీటు సాధించడం పెద్దకష్టం కాదంటున్నారు విద్యావేత్తలు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా కేంద్రం కొన్ని దశాబ్దాల క్రితమే దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా 1984వ సంవత్సరం మదనపల్లెలో, 1987వ సంవత్సరం రాజంపేటలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. మదనపల్లెకు చెందిన నవోదయ విద్యాలయం తొలుత హార్సిలిహిల్స్‌లో ఏర్పాటయింది. అనంతరం మదనపల్లె మండలం వలసపల్లెలో ఏర్పాటు చేశారు. క్రమశిక్షణతో మెరుగైన విద్యను అందించడం జవహర్ నవోదయ విద్యాలయాల ప్రత్యేకత. 2026–2027 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపల్ ఎం. గీత తెలిపారు.

దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు వీరే

- ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు.
- అలాగే ఏదైనా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో మూడు, నాలుగు, ఐదవ తరగతి తప్పని సరిగా చదివి ఉండాలి.
- ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినా 2025–2026 విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికే సీటు లభిస్తుంది.
- నోటిఫికేషన్‌లో పొందు పరిచిన విధంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారికి సీట్లు కేటాయిస్తారు.
- గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదివిన వారికి 75 శాతం, పట్టణ ప్రాంత పాఠశాలల్లో చదివిన వారికి 25 శాతం సీట్ల కేటాయింపు ఉంటుంది.
- గతంలో పరీక్ష రాసిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులు.

ఇవీ ప్రయోజనాలు..

- నవోదయ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి సీటు పొందిన విద్యార్థులకు 12వ తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌లో ఉచితంగా విద్య అందిస్తారు.
- మెరుగైన విద్యాబోధనతో పాటు మెరుగైన వసతి సౌకర్యం, నాణ్యమైన భోజనం, పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం అన్ని ఉచితంగా కల్పిస్తారు.
- విద్యార్థులకు వేర్వేరుగా వసతి, భోజన సౌకర్యం ఉంటుంది.
- విద్యాబోధన మాత్రం కంబైన్డ్ విధానంలో ఉంటుంది.
- కంప్యూటర్ కోర్సుతో పాటు ఎన్‌సీసీ, స్కౌట్ అండ్ గైడ్స్, సంగీతం, నృత్యం, డ్రాయింగ్, క్రాఫ్ట్, క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

సీట్ల కేటాయింపు ఇలా..

- ఆరవ తరగతిలో 80 సీట్లు ఉంటాయి. ఈ సీట్ల భర్తీకే ప్రస్తుతం నోటిఫికేషన్ విడుదలైంది.
- 80 సీట్లలో 60 సీట్లు గ్రామీణ ప్రాంత విద్యార్థులతో, 20 సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులతో భర్తీ చేస్తారు.

రిజర్వేషన్ సౌకర్యం ఇలా..

- బాలికలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుంది.
- గ్రామీణ ప్రాంత విద్యార్థుల సీట్ల భర్తీలో 9 సీట్లను ఎస్సీలతో, ఐదు సీట్లు ఎస్టీలతో భర్తీ చేస్తారు.
- పట్టణ ప్రాంత విద్యార్థుల సీట్ల భర్తీలో మూడు సీట్లు దివ్యాంగులకు, మూడు సీట్లు ఎస్సీలకు, ఒక సీటు ఎస్టీలతో భర్తీ చేస్తారు.

పరీక్షా విధానం ఇలా..

- మొత్తం నూరు మార్కులకు పరీక్ష ఉంటుంది.
- మెంటల్ ఎబిలిటీ, గణితం, పేరాగ్రాఫ్స్ ఇలా మూడు విభాగాల్లో 80 ప్రశ్నలు ఉంటాయి.
- మెంటల్ ఎబిలిటీకి (మేధాశక్తి)కి సంబంధించి 50 మార్కులకు గాను 40 ప్రశ్నలు పది భాగాల్లో ఉంటాయి. ఒక్కో భాగంలో నాలుగు ప్రశ్నలు దయాగ్రమ్స్ రూపంలో ఉంటాయి.
- గణితంకు సంబంధించి 25 మార్కులకు 20 ప్రశ్నలు ఉంటాయి.
- పేరాగ్రాఫ్స్‌కు సంబంధించి 25 మార్కులకు 20 ప్రశ్నలు ఉంటాయి.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ 29–7–2025
- ప్రవేశ పరీక్ష తేదీ – 13–12–2025

ఆరునెలలు ఆటలను కట్టిపెట్టాలి



విద్యార్థులు ఆరునెలల పాటు ఆటలు కట్టి పెట్టి సమయాన్ని వృథా చేసుకోకుండా కష్టపడి చదివితే నవోదయ విద్యాలయంలో సీటు సాధించవచ్చు. నవోదయ విద్యాలయంలో సీటు సాధిస్తే భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుంది. టెన్త్‌లో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఎంతటి శ్రద్ధ తీసుకుంటారో అంత కన్నా ఎక్కువగా నవోదయ ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థుల విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని ఒక ప్రణాళికాబద్ధంగా చదివిస్తే తప్పక సీటు లభిస్తుంది. నవోదయ విద్యాలయంలో విద్యార్థులు సీటు సాధించాలంటే తల్లిదండ్రుల పాత్ర అత్యంత ముఖ్యమైనది.

– కొండూరు రఘునాథరాజు, ఎంఈఓ, రాజంపేట

ఈ 'పాప'ం ఎవరిది!



గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన చిన్నారి

రాయచోటి జగదాంబసెంటర్ : మూడు రోజుల క్రితం జన్మించిన మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు గోనె సంచిలో తీసుకొచ్చి గడ్డివామి వద్ద వదిలేసి వెళ్లారు. ఈ సంఘటన వీరబల్లి మండలం వంగిమళ్ల పంచాయతీ పెద్ద దళితవాడ వద్ద మంగళవారం వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి పి.రమాదేవి చిన్నారికి వైద్య పరీక్షలు చేయించి రాయచోటిలోని శిశు గృహలో ఉంచారు. చిన్నారికి సంబంధించిన తగిన ఆధారాలతో 30 రోజుల్లోగా తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. లేనిపక్షంలో ఈ బిడ్డను అనాథగా ప్రకటించి ప్రభుత్వ షరతులు, నియమాల ప్రకారం మరొకరికి దత్తత ఇస్తామని తెలిపారు.

నీటి తొట్టిలో పడి బాలిక మృతి



బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి

రాజంపేట : మండలంలోని ఆకేపాడు కట్టకిందపల్లెలో మల్లిక (8) అనే బాలిక మంగళవారం ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి బాలిక మృతదేహాన్ని చూసి చలించిపోయారు. మృతురాలి తండ్రి శ్రీధర్‌రెడ్డిని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాలిక మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, పోలీసు అధికారులు

కడప అర్బన్ : డ్రగ్స్ రహిత సమాజమే మన లక్ష్యమని.. సమష్టి కృషితో డ్రగ్స్‌ను పారదోలుదామని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ఈగల్' (ఎలైట్ యాంటి నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించే పోస్టర్లను జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ ప్రత్యేక వ్యవస్థ పై ప్రజలకు, యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి జిల్లాలో ఈ టాస్క్‌ఫోర్స్ విభాగం ఉంటుందన్నారు. ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా, సాగు, విక్రయాలు, వినియోగం, తదితరాల గురించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1972కు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టాస్క్ ఫోర్స్ నోడల్ ఇన్‌చార్జి ఆఫీసర్, ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎం.డి. రియాజ్ అహమ్మద్, సైబర్ సెల్ సి.ఐ. నాగరాజు, డీసీఆర్‌బీ ఎస్.ఐ. బీవీ క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కడప అర్బన్ : కడప రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో డాక్టర్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మృతదేహం చేతికి క్యాన్‌లా ఉంది. అలాగే కడప రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చి అస్వస్థతకు గురై మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. రిమ్స్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి, కుమార్తెపై దాడి

మదనపల్లె రూరల్ : ఒంటరి మహిళను బలవంతం చేసిన విషయం నిలదీసినందుకు తండ్రి, కుమార్తెపై దాడిచేసిన ఘటన మదనపల్లె మండలంలో సోమవారం రాత్రి జరిగింది. వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నెకు చెందిన హరిబాబు భార్య రెడ్డెమ్మ(30) ఆరేళ్ల క్రితం భర్త చనిపోవడంతో ముగ్గురు పిల్లలతో కలిసి కూలిపనులు చేసుకుంటూ జీవిస్తోంది. సోమవారం సాయంత్రం కూలిపనులకు వెళ్లి తిరిగి వచ్చి ఇంటిలో ఉండగా, అదే గ్రామానికి చెందిన విజయభాస్కర్, ఆమె ఇంట్లోకి చొరబడి రెడ్డెమ్మను బలవంతం చేశాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయం బాధితురాలు తన తండ్రి రమణయ్యకు తెలపగా, ఆయన మొలకలదిన్నెకు బంధువులతో కలిసి వచ్చి విజయభాస్కర్‌ను నిలదీయగా, అతను రమణయ్య, రెడ్డెమ్మలపై దాడిచేసి కొట్టాడు.

నీటి కుంటలో పడి కాడెద్దులు మృతి



మృతి చెందిన ఎద్దుల వద్ద రోదిస్తున్న సాంబశివారెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని యలంకూరుపల్లెలో మంగళవారం ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి కాడెద్దులు మృతి చెందాయి. వివరాలిలా.. యలంకూరుపల్లె గ్రామానికి చెందిన యలంకూరు సాంబశివారెడ్డి ఎద్దులను పెట్టుకొని వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చిన డబ్బుతో బతుకుదెరువు కొనసాగించేవాడు. ఉదయాన్నే వ్యవసాయ పనులకు వెళ్లి ఎద్దులకు నీటిని తాపించేందుకు బండితో సహా నీటి గుంత వద్దకు తీసుకెళ్లాడు. నీళ్లు తాగే సమయంలో బండి ముందుకు దొర్లడంతో ఎద్దులు రెండు నీటి గుంతలో పడి బురదలో ఇరుక్కు పోయి ఊపిరి ఆడక మృతి చెందాయి. రెండు ఎద్దులు మృతి చెందడంతో 2 లక్షల రూపాయలు నష్టపోవడంతో పాటు బతుకుదెరువు కోల్పోయామని కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ప్రతిభ గల విద్యార్థినులకు ఉచిత విద్య

కడప కల్చరల్ : గ్రామీణ ప్రాంతాలలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రతిభావంతులైన పేద విద్యార్థినులు ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి ముగించుకుని ఎనిమిదవ తరగతిలో ప్రవేశించే వారికి ఉచిత విద్యను అందిస్తున్నట్లు కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరంలోని రెడ్డి సేవా సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన రెడ్డి సామాజిక పేద విద్యార్థినులు ఎనిమిదవ తరగతిలో ప్రవేశం కోసం 2025 జూన్ 15వ తేదీ లోపల కడప నగరం రాజీవ్ మార్గ్ రెడ్డి సేవా సమితి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవలసిందిగా కోరారు. పూర్తి వివరాలకు 9440523484, 9440651284, 9989465956 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి, జిల్లా రెడ్డి జనసంఘం అధ్యక్షుడు మద్దిక సుబ్బిరెడ్డి, రెడ్డి సేవా సమితి కార్యవర్గ సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారులకు అంతర్జాతీయ ఫిడే రేటింగ్



చెస్‌లో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించిన రవి వసంత కుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ చెస్ క్రీడాకారులు అంతర్జాతీయ ఫిడే చెస్ రేటింగ్‌లను సాధించడం గర్వకారణమని జిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్ దర్బారి పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ మైదుకూరుకు చెందిన రవి వసంత కుమార్ తమిళనాడు రాష్ట్రంలోని తిరుపత్తూర్ అలాగే ఢిల్లీలో నిర్వహించిన రెండు ఫిడే క్లాసికల్ రేటింగ్ టోర్నమెంట్లలో పాల్గొని తన అద్భుతమైన ప్రదర్శనతో 1452 క్లాసికల్ ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్‌ను పొందారన్నారు. ప్రస్తుతం ఆయన కాశినాయన మండలం, ఇటుకలపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారన్నారు.

అలాగే ప్రొద్దుటూరుకు చెందిన నదీమ్ సాహెబ్ గారి ముజమ్మిల్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఫిడే రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని 1491 రాపిడ్ ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్‌ను పొందారన్నారు.

ఈ ఇద్దరు క్రీడాకారుల ఫిడే రేటింగులను ఫిడే అంతర్జాతీయ చెస్ సమాఖ్య తమ అధికారిక వెబ్ సైట్‌లో ఈ నెల 1వ తేదీన ప్రకటించిందన్నారు.

చాపాడు మండలంలో ఖనిజ నిక్షేపాల కోసం అన్వేషణ



సీతారామాపురం వద్ద పంట పొలాల్లో బోర్లు వేసే వాహనాలు

చాపాడు : మండల పరిధిలోని సీతారామాపురం, కుచ్చుపాప, నరహరిపురం, అనంతపురం తదితర గ్రామాల పరిధిలోని పంట పొలాల్లో ఖనిజ నిక్షేపాల కోసం అన్వేషణ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో గత పది రోజులుగా మండలంలోని వివిధ గ్రామాలలోని పంట పొలాల్లో బోర్లు, ఫిల్లర్ల ద్వారా రిగ్గు వేసి లోపల ఉండే ఖనిజాలను అన్వేషిస్తున్నారు. వందల సంఖ్యలో వాహనాలతో జరుపుతున్న ఈ పరిశోధనలో ఆయిల్, ఇతర ముడి ఖనిజాల కోసం అన్వేషణ చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఎకరా పొలం పొడవునా 20 చోట్ల బోర్లు వేస్తూ అందులో అన్వేషణ చేసి వెంటనే వాటిని పూడ్చి వేస్తున్నారు. పంట పొలాల్లో జరుగుతున్న ఖనిజ అన్వేషణను స్థానిక ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.

ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలి

ఏయూ అచీవర్స్‌డేలో చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అన్నమాచార్య యూనివర్సిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీ విద్యార్థులు ఉద్యోగాలు పొందడమే కాకుండా ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని యూనివర్సిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి పేర్కొన్నారు. అన్నమాచార్య యూనివర్సిటీలో అచీవర్స్‌డే–2025ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయం సాధించాలంటే నిరంతరం కృషి చేయాలన్నారు. ఇందులో తల్లిదండ్రుల పాత్ర గొప్పదన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి సునీల్ అల్లువాడ మాట్లాడుతూ ఎన్నో కంపెనీల్లో విద్యార్థులు ఎంపిక కావడమే కాకుండా, ఇంటర్న్‌షిప్‌లో కూడా పాల్గొన్నారన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో నిబద్ధత, మానవతా విలువలు గర్వించదగ్గవన్నారు. వైస్ చాన్సలర్ డాక్టర్ సాయిబాబారెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ ఖ్యాతి విద్యార్థుల ప్రతిభపైనే ఆధారపడి ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ మల్లికార్జునరావు, ఇండ్రస్టియల్ రిలేషన్స్ అండ్ ప్లేస్‌మెంట్స్ జేఎన్‌టీయూ (అనంతపురం) ప్రొఫెసర్ కిరణ్మయి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హేమకేశవులు, వివిధ విభాగాల డీన్‌లు, శాఖాధ్యక్షులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి

రాజంపేట : తనపై శవనవారిపల్లెకు చెందిన కొందరు దాడి చేసినట్లు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహారాజు మంగళవారం మీడియా ఎదుట ఆరోపించారు. సోమవారం రాత్రి ఇంట్లోకి చొరబడి రాడ్లతో దాడి చేశారన్నారు. గొడవను శక్తి యాప్‌లో చిత్రీకరిస్తుంటే మొబైల్ ఫోన్‌ను దౌర్జన్యంగా లాక్కొని ధ్వంసం చేశారన్నారు. ఉపాధి పనులకు రాక పోయినా తమ పేరు నమోదు చేసి బిల్లు పెట్టాలంటూ గొడవకు దిగారన్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేశారన్నారు. తనకు రక్షణ కల్పించాలని కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం సత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన స్నేహితులు ఫారూక్(20), చైతన్య(19) ద్విచక్ర వాహనంలో బి.కొత్తకోట మండలం హార్సిలీ హిల్స్ కు వెళ్లేందుకు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి రెండు ద్విచక్ర వాహనాల్లో బయలుదేరారు. మార్గమధ్యంలోని ములకలచెరువు మండలం బురకాయలకోట వద్దకు రాగా, ద్విచక్ర వాహనం నడుపుతున్న ఫారూక్‌కు, ఫిట్స్ రావడంతో వాహనం అదుపుతప్పి ఇద్దరు కింద పడ్డారు. చైతన్య గాయపడగా ఫారుక్ తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి వెళ్లాడు. స్థానికులు బాధితులు ఇద్దరిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఫారుక్‌ను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అదేవిధంగా ములకలచెరువు పట్టణంలోని షాపులో పనిచేస్తున్న హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీనారాయణ (50) వ్యక్తిగత పనులపై కదిరి పట్టణానికి వెళ్లి తిరిగి ఆర్టీసీ బస్సులో ములకలచెరువుకు వస్తుండగా, మార్గమధ్యంలోని చీకటిమాను పల్లె వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో దాదాపు పది మందికి పైగా గాయపడగా, లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వారు వేర్వేరు ఆసుపత్రులకు వెళ్లగా, లక్ష్మీనారాయణను స్థానికులు మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు పంపారు.

SATSANG VIDYALAYA E.M. HIGH SCHOOL
(Recognised by the Govt.of A.P.R.C. No. 28342100133 / Annamayya / 2025 - Dt. 28.01.2025)
Nakkaladinnethanda Extension, Ponnettipalyem, Road, Madanapalle-517325
WANTED TEACHERS
Experienced & Trained Post Graduates / Graduates with B.Ed. / TTC / D.Ed. to Teach Telugu & English for High School (VI to X) & English & PET for classes III to V
Walk in interview : 06.06.2025 & 07.06.2025 - Bet. 10.00 am to 4.00 p.m. at school Office
- Preference will be given to experienced teachers
- Salary is not a constraint for deserving candidates
- Conducive work atmosphere
- Lunch is provided at school
Confirm your visit & mail to : vidyalaya@satsang-foundation.org
Contact : 7075994999 - 8500199929 - Stephen Mathews, Principal

సాక్షి క్లాసిఫైడ్స్

SERIVCES

MARRIAGE SERIVES

■ శెట్టి బలిజ OC/30Y/5.3H/ Fair/ వధువుకు 1వ, 2వ,వరుడు కావలెను. డైరెక్ట్. సెల్ : 6301658600

BOREWELLS

■ బోర్ పాయింట్ చూడబడును. జై గురుదత్త K.V రమణ M.Sc geologist భూగర్భ జల పరిశోధన సెల్ : 6302328007.

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్/ ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (ఆర్జిస్ట్ హోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. ఫోన్ 7382114847

PERSONAL CARE

CHANGE OF NAME

■ I Vemala KHADEERUNNISA (Old Name) w/o Vemala saleem bhasha 1/793-1, near shanthi sagar hotel yerramukkapalli circle, kadapa city, ysr kadapa district. has been changed my name is PATAN KHADIRUNNISA (New name) for all purpose.

■ I BAYAPUREDDY VENU GOPAL REDDY S/O LATE BAYAPUREDDY SIVARAMI REDDY R/O D.NO:3/647, GAYATHRI NAGAR, YMR COLONY, PRODDATUR TOWN & MANDAL. YSR KADAPA DIST AP. PREVIOUSLY MY SON NAME AS BAYAPUREDDY DHEERAJH RREDDE (OLD NAME). NOW I CHANGE MY SON NAME AS BAYAPUREDDY DHEERAJH REDDY (NEW NAME)

■ I BAYAPUREDDY VENU GOPAL REDDY S/O LATE BAYAPUREDDY SIVARAMI REDDY R/O D.NO :3/647,GAYATHRI NAGAR, YMR COLONY, PRODDATUR TOWN & MANDAL, YSR KADAPA DIST. AP. PREVIOUSLY MY SON NAME AS BAYAPUREDDY KESHAVVAA REDDY (OLD NAME) NOW I CHANGE MY SON NAME AS BAYAPUREDDY KESHAVA REDDY (NEW NAME)

WANTED

■ ప్రముఖ తెలుగు దినపత్రికలో పని చేయుటకు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అనుభవం గల విలేకర్లు, రిపోర్టర్లు, వీడియో ఎడిటర్లు, సబ్ ఎడిటర్లు (స్క్రిప్ట్ రైటర్స్), మహిళలు లేదా పురుషులు కావలెను. సంప్ర: 9014101908, 9492069705

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,భోజనం+భోజనం.Hyd.7995365999

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.